www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 07 | ఏప్రిల్ | 2026
పేజీలు : 8

## కారుని ఢీకొట్టిన లారీ

**దంపతులు మృతి, ఇద్దరికి గాయాలు**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** కారును లారి ఢీకొట్టడంతో దంపతులు ఇద్దరు చనిపోయి ఇద్దరు చికిత్సపొందుతున్న సంఘటన మండల కేంద్రం కొణిజర్ల సమీపంలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం మండలం కోరపూడి జంక్షన్ గాదాలమ్మ నగర్‌కు చెందిన ఉండమట్ల వీర్రాజు (46) ఉండమట్ల వీరశైలజ (36)

మిగతా 2లో..

# విద్యా, రవాణా కూడలిగా బోనకల్










**-విద్యాహబ్‌గానూ అభివృద్ధి**
**-నిర్మాణ దశలో సమీకృత విద్యాలయం**
**-రెండు మోడల్ విద్యాలయాలు మంజూరు**
**-సమగ్రాభివృద్ధికి భట్టి ప్రత్యేక కృషి**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** బోనకల్ అనగానే గుర్తుకు వచ్చేది రాజకీయ చైతన్యం. రాజకీయ చైతన్యానికే గాక ఆధునీక వ్యవసాయానికి పెట్టింది పేరుగా నిలిచింది. విద్య సముపార్జనలోనూ జిల్లాలో మిగిలిన ప్రాంతాలకు దీటుగా బోనకల్ నిలిచింది. వ్యవసాయ రంగంలో ఆధునీక పద్ధతులను అనుసరించి వ్యవసాయం చేస్తూ అత్యధిక దిగుబడులను సాధిస్తున్నారు. ముఖ్యంగా వాణిజ్య పంటలైనా మొక్కజొన్న, మిర్చి, పత్తి పంటల సాగులో ఇక్కడి రైతులు ముందు వరుసలో నిలిచారు. జనవరి మాసం తర్వాత ఏ గ్రామానికి వెళ్లినా మొక్కజొన్న, మిర్చి రాశులు కనిపిస్తుంటాయి. అటువంటి బోనకల్ మండలం ఇప్పుడు జిల్లాలోని ప్రధాన పట్టణాలకు దీటుగా ఒక ప్రధాన కూడలిగా అభివృద్ధి చెందనుంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, స్థానిక శాసన సభ్యులు మల్లు భట్టివిక్రమార్క కృషితో బోనకల్ మండం సమగ్రాభివృద్ధి దిశగా పయనిస్తుంది. రహదారులు, విద్య, వ్యవసాయ రంగాల్లో పురోగమిస్తుంది. పలు ప్రధాన రహదారులు బోనకల్ కేంద్రంగా అనుసంధానం కానున్నాయి.

మిగతా 2లో..

## ప్రణాళికాబద్ధంగా ధాన్యం కొనుగోళ్లు



**-ధాన్యం రవాణా వాహనాలకు జిపిఎస్ ట్రాకింగ్ ఏర్పాటు**
**-ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించిన కలెక్టర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రణాళికాబద్ధంగా రబీ (యాసంగి) పంట ధాన్యం కొనుగోళ్లకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో సోమవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్లు డా॥పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రబీ పంట కోతల ఆధారంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. రైతుల నుంచి డిమాండ్ రాక ముందే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కావాలని మండలాల్లో కోతలు ఏ సమయంలో జరుగుతాయో షెడ్యూల్ సిద్ధం చేయాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. గన్నీ సంచులు అవసరం మేరకు ఆర్డర్ చేసి తెచ్చి పెట్టుకోవాలని కలెక్టర్ తెలిపారు. రబీ కొనుగోలు సజావుగా సాగేందుకు వీలుగా ప్రతి వాహనానికి జిపిఎస్ ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో

### ప్రజలకు పారదర్శకంగా లబ్ధి జరిగేలా చర్యలు : కలెక్టర్

పాలన ద్వారా ప్రజలకు పారదర్శకంగా లబ్ది జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పరిపాలన అంశాలపై అధికారులతో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వివిధ ప్రభుత్వ శాఖల్లో నమోదవుతున్న సిబ్బంది హాజరును పరిశీలించి తక్కువ సిబ్బంది

మిగతా 2లో..

## దళితులంతా సంఘటితం కావాలి



**-బిజెపి పాలనలో దళితులపై పెరిగిన దాడులు**
**-నిధుల కేటాయింపులో చిన్నచూపు**
**-డిహెచ్‌పిఎస్ రాష్ట్ర 2వ మహాసభలను జయప్రదం చేయండి**
**-మారపాక అనీల్, సాబీర్ పాషా, సలిగంటి**

**ప్రజాపక్షం/కొత్తగూడెం:** తరాలుగా అణిచివేత, అంటరానితనం , వివక్షత, పోపిడీకి గురవుతున్న దళితులంతా సంఘటితమైన నాడే సమస్యలను అదిగమించే అవకాశం ఉంటుందని దళిత హక్కుల పోరాట సమితి(డిహెచ్‌పిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనీల్ అన్నారు. సోమవారం సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో డిహెచ్‌పిఎస్ జిల్లా విస్తృతస్థాయి సమావేశం పేరాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి విచ్చేన అనీల్ మాట్లాడుతూ అంటరాని తనం అనే అమానవీయ దురాచారానికి దళితులు తరతరాలుగా బలైపోతున్నారని, సామాజిక, రాజకీయ, ఆర్థిక అసమానతలను ఎదుర్కొంటున్నారని, దీనిని తప్పికొట్టేందుకు దళితులంతా ఏకం కావాలన్నారు. దేశంలోని నరేంద్రమోడి పాలనలో దళితులపై దాడులు 400 రెట్లు పెరిగాయని, ఉత్తర భారతంలో దళితులపై జరుగుతున్న అగాయిత్యాలు వర్ణించతరం కాదన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, కూల నిర్మూలన కాగితాలకే పరిమితమైందన్నారు. డా.బి ఆర్ అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్లు పాలకుల విధానాల వల్ల అపహాస్యం పాలవుతున్నాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలకు పాలకులు పాతరవేస్తూ ప్రైవేటీ కరణవైపు మొగ్గు చూపుతున్నారని, తద్వారా దళితులు ఉపాధి అవకాశాల్లో వెనుక్కు నెట్టబడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడం వల్ల రిజర్వేషన్ సౌకర్యంతో ఉద్యోగ అవకాశాలు పొందే దళితులకు అన్యాయం జరుగుతుందని మండిపడ్డారు ప్రైవేటు రంగంలో కూడా

మిగతా 2లో..

# విద్యా, రవాణా కూడలిగా బోనకల్

(మొదటిపేజీ తరువాయి)



జిల్లాలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే మినహా మిగిలిన ప్రధాన రహదారులు బోనకల్ మండల స్వరూపాన్ని మార్చనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని జగ్గయ్యపేట నుంచి కొత్తగూడెం వరకు నిర్మించనున్న నాలుగు లైన్ల రహదారి బోనకల్ మండల కేంద్రంగా వెళ్ల నుండడంతో రెండు రాష్ట్రాలను కలుపుతూ ఇది ఒక ప్రధాన రహదారిగా మారనుంది. హైదరాబాద్, విజయవాడ హైవేకు అనుసంధానం కానుంది. నాగపూర్, అమరావతి హైవే మధిర, బోనకల్ క్రాస్ రోడ్డు వద్ద పెద్ద రింగ్ ఏర్పాటు కానుండడంతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందనుంది. నాగపూర్, అమరావతి హైవేపై ఖమ్మం తర్వాత ఇక్కడే ఎగ్జిట్ ఇవ్వడంతో వైరా, మధిర, జగ్గయ్యపేటకు వెళ్లే వాహనాలతో బోనకల్ క్రాస్ రోడ్డు ఒక రద్దీ ప్రాంతంగా మారనుంది. ఖమ్మం నుంచి నాగులవంచ, బోనకల్, ఆళ్లపాడు, రాయన్నపేట, మధిర మండలం వంగవీడు మీదుగా నాలుగు లైన్ల ప్రధాన రహదారి నిర్మాణానికి రూ. 350 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇది ఖమ్మం జిల్లాలోనే ఒక ప్రధాన రహదారిగా నిలవనుంది. పచ్చటి పొలాల మధ్య నిర్మాణం జరిగే ఈ రహదారి అనేక గ్రామాలను అభివృద్ధి దిశగా నడిపించనుంది. ప్రధాన రహదారులతో పాటు మండలంలోని గ్రామాలను కలుపుతూ అనేక లింక్ రోడ్ల నిర్మాణం పూర్తికాగా మరికొన్ని రోడ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. మోటమర్రి నుంచి వైరా మండలం గన్నవరంకు రాయన్నపేట, కలకోట, రాపల్లి గ్రామాల మీదుగా డబుల్ రోడ్డు నిర్మాణం జరుగుతుంది. ప్రతి గ్రామం నుంచి మరో గ్రామానికి లింక్ రోడ్ల నిర్మాణం దాదాపు పూర్తయింది. మల్లు భట్టివిక్రమార్కకు మండలంపై ఉన్న అవగాహన, అభివృద్ధి కాంక్ష ఈ అభివృద్ధికి దోహదపడింది.

**విద్యా హబ్‌గా బోనకల్...**

బోనకల్ మండలం విద్యా పరంగా ఇప్పటికే అభివృద్ధి చెందింది. ప్రతి గ్రామంలోనూ విద్యావంతులు, ప్రభుత్వ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ఉండడంతో పాటు ఉన్నత విద్యను అభ్యసించి విదేశాలలో స్థిరపడిన వారు ప్రతి గ్రామంలోనూ ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఈ క్రమంలో సామాన్యులను దిగువ మధ్యతరగతి, బడుగు, బలహీన వర్గాల పిల్లలను ఉన్నత విద్యకు చేరువ చేసి ఉన్నత స్థాయికి చేర్చేందుకు ప్రభుత్వ పరంగా ఒక బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారు. బోనకల్ మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో సమీకృత విద్యాలయాన్ని నిర్మిస్తున్నారు.నిర్మాణ పనులను మల్లు భట్టి విక్రమార్క నిరంతరం పర్యవేక్షిస్తూ పనుల్లో వేగం పెంచేందుకు కృషి చేస్తున్నారు. ఈ విద్యాలయ నిర్మాణం పూర్తయితే కొన్ని వేల మందికి ఆధునిక వసతులతో పాటు మారిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యా బోధన జరగనుంది. దీనికి తోడు చిరునోముల, రావినూతల గ్రామాల్లో మోడల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల్లో పిల్లలను మోడల్ స్కూల్స్‌కు చేర్చడంతో పాటు ప్రత్యేక యూనిఫాం, ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసి అత్యున్నత పద్ధతుల్లో విద్యా బోధన చేపట్టనున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో విద్యను తమ పిల్లలకు అందించలేకపోతున్నామనే అనేక మంది తల్లిదండ్రుల వ్యథను తీర్చేందుకు ప్రభుత్వం ఈ మోడల్ స్కూల్స్‌ను స్థాపించింది. మండలంలోని కలకోట గ్రామంలో మరో మోడల్ స్కూల్ ఏర్పాటుకు కూడా ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. వ్యవసాయ రంగానికి సంబంధించి చిన్న చెరువులను, కుంటలను అభివృద్ధి చేయడంతో పాటు జాలిముడి కాలువ ద్వారా ఐదువేల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు కాలువలను ఆధునీకరించనున్నారు. నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధికి నీటి ఎద్దడి లేకుండా నీరందించేందుకు చర్యలు చేపట్టనున్నారు. బోనకల్ మండలాన్ని అన్ని విధాలా సమగ్రాభివృద్ధి చేసేందుకు భట్టి విక్రమార్క కృషి చేస్తున్నారు. బోనకల్ మండలంపై ప్రత్యేక దృష్టి సారించారు.

# దళితులంతా సంఘటితం కావాలి





(మొదటిపేజీ తరువాయి)

రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. దేశంలో పాలన సాగిస్తున్న బిజెపి ప్రభుత్వం దేశంలో రెండు కోట్ల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి కనీసం రెండు వేల ఉద్యోగాలను కూడా భర్తీ చేయలేద యద్దేవా చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలు దళితుల అభివృద్ధికి చట్టబద్దంగా కేటాయిచాల్సిన 20శాతం నిధులను ఏనాడూ కేటాయించలేదని, అరకొర కేటాయింపులు కూడా దళిత వర్గాల సంక్షేమానికి వినియోగించకుండా పాలకులు దారిమళ్లిస్తున్నారని మండిపడ్డారు. ఎస్సీల అభివృద్ధి కోసం కేటాయించాల్సిన నిధుల్లో గణనీయమైన తగ్గింపు, కోతలు విధింపుతో వివక్షత కొనసాగుతోందన్నారు. 201718లో ఎస్సి సబ్ ప్లాన్ రద్దు చేయడం ద్వారా బిజేపి ప్రభుత్వం దళితులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. అనంతరం డిహెచ్‌సిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రంలో దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, నిధులు, నీళ్లు, నియామకాల పేరుతో అధికారంలోనికి వచ్చిన కేసిఆర్ ప్రభుత్వం ధరణి పేరుతో దళితులు భూములను లాక్కుందని, ఊరి చివరిన సాగుచేసుకునే దళితుల భూములను స్మశాన వాటికలు, పార్కులు, వనాల పేరుతో గుంజుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దళితుల ఆర్థిక, రాజకీయ సమాజిక హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం కొరకు, కుల వివక్షత నిర్మూలన కొరకు ఆందోళనలు, పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని, ఇందు కోసం ఈ నెల 17,18 తేదీల్లో వరంగల్ వేదికగా జరిగే డిహెచ్‌పిఎస్ రాష్ట్ర 2వ మహాసభలను జయప్రథం చేయాలన్నారు. అనంతరం మేయర్ మూడ్ గణేష్‌తో పాటు దళిత సామాజిక వర్గానికి చెందిన నూతన కార్పోరేటర్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కె రత్నకుమారి, మోహన్ రావు, మేయర్ మూడ్ గణేష్, కార్పోరేటర్లు పోలమూరి ధనలక్ష్మి, మద్దాల హరిత, గుర్రం వెంకటేశ్వర్లు, ఎర్రవెల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పాలవాగు ఆదివాసీలకు సోలార్ లైట్స్ పంపిణీ

**రూ.లక్ష విలువైన సోలార్ విద్యుత్ దీపాలను 50 మందికి పంపిణీ**







**ప్రజాపక్షం/ఖమ్మం/ములకలపల్లిః** ములకలపల్లి గ్రామానికి చెందిన పుప్పాల కుటుంబ సభ్యులు తమ తల్లి పుప్పాల ఇందిరమ్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా పాలవాగు రెండు గుంపుల ఆదివాసులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో వలస ఆదివాసుల 50 ఇళ్లకు విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందిపడుతుండటంతో హైదరాబాద్‌కు చెందిన రాబిన్ హుడ సంస్థను సంప్రదించి వారి సహకారంతో 50 గృహాలకు సోలార్ విద్యుత్ దీపాలు అదేవిధంగా ప్రతి ఇంటికి 10 రోజులకు సరిపడా బియ్యం, పప్పు, నూనె, నిత్యవసరాలను అందజేశారు. ఈ సందర్భంగా ములకలపల్లి వాసి వైరా ప్రస్తుత ఎస్సై పుప్పాల రామారావు మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అందులో భాగంగా ఈ రోజు మా మాతృమూర్తికి పుప్పాల ఇందిరమ్మ ద్వితీయ వర్ధంతిని స్వచ్ఛమైన మనసున్న ఆదివాసుల మధ్య జరుపుకోవాలని భావించి మా కుటుంబ సభ్యులం ఈ కార్యక్రమాలను రాబిన్ హుడ్ ఆర్మీ సహకారంతో పాలవాగు ఆదివాసుల మౌలిక సౌకర్యం అయిన సోలార్ లాంప్, నిత్యవసరాలను అందించామని, భవిష్యత్తులో వారికి తమ కుటుంబం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండాలపాడు సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు, రాబిన్‌హుడ్ ఆర్మీ ప్రతినిధులు రమేష్, కిరణ్, పుప్పాల కుటుంబ సభ్యులు వెంకన్న, చందర్‌రావు, సాయి, ఐద్వా నాయకురాలు సందకురా లక్ష్మి, మండల ప్రముఖులు నూపా భాస్కర్, బండి కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

# కారుని ఢీకొట్టిన లారీ

(మొదటిపేజీ తరువాయి)

కుమారుడు యశ్వంత్ తో కలిసి ఆదివారం రాత్రి సుమారు 2 గంటల సమయంలో గాదాలమ్మ నగర్ నుంచి హైదరాబాద్ కారులో బయలుదేరి వెళులుతున్నారు. సోమవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో నాగార్జునసాగర్ కాలువ వంతెనపై ఖమ్మం వైపునుంచి వైరా వైపు వెళుతున్న లారి కారును బలంగా ఢీకొట్టడంతో కారు పక్కకు పోయింది. కారు వెనుక ఉన్న లారిని అదే వేగంతో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న దంపతులు ఉండమట్ల వీర్రాజు, ఉండమట్ల వీరశైలజ, యశ్వంత్, లారీ డ్రయివర్ అలుగోలు శ్రీను లను ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతు దంపతులు ఇద్దరు మృతిచెందారు. యశ్వంత్, అలుగోలు చికిత్సపొందుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రణాళికాబద్ధంగా ధాన్యం కొనుగోళ్లు

(మొదటిపేజీ తరువాయి)

హాజరు నమోదు ఉన్న ప్రభుత్వ శాఖల అధికారులు కారణాలతో కూడిన వివరణ సమర్పించాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పరిష్కారం, పెండింగ్ భూ భారతి దరఖాస్తులు, భూ సేకరణ, అటవీ రెవెన్యూ శాఖ భూ వివాదాల పరిష్కారం వంటి పలు అంశాలపై గురువారం రెవెన్యూ, ఇతర సంబంధిత అధికారులతో రివ్యూ ఉంటుందని అధికారులు సంపూర్ణ సమాచారంతో సమావేశానికి హాజరు కావాలన్నారు. స్వశక్తి మహిళా సంఘాలచే పెట్రోల్ బంక్ ప్రారంభించేందుకు వీలుగా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎర్రుపాలెం మండలం రాజులపాలెంలో మహిళా సంఘాల ద్వారా చేపట్టిన సౌర విద్యుత్ ప్లాంట్ చివరి దశకు చేరుకుందని చిన్నకోరుకొండిలో పనులు ఆలస్యం అవుతున్నాయని ప్రత్యామ్నాయ స్థల ఎంపికకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల పట్ల ప్రతి శాఖాధికారులు ప్రత్యేక శ్రద్ధతో చర్యలు తీసుకోవాలన్నారు. హెల్త్ వీక్‌కు సంబంధించి నిర్దేశించిన కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణకు సంబంధించి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని పంచాయతీ అధికారి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మాతృ శిశు మరణాలు సున్నాకు తగ్గించడమే లక్ష్యంగా మిషన్ జీరో పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. పిహెచ్‌సిల వారీగా హైరిస్క్ గర్భిణీ కేసులు గుర్తించి అవసరమైన వైద్య చికిత్సలు ముందు నుంచే అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జెడ్పిసిఈవో దీక్షా రైనా, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రామారావు, అడిషనల్ డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ చందునాయక్, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తు చేసిన ప్రతులను సమర్పించాలి



**ప్రజాపక్షం/కల్లూరుః** స్వయం ఉపాధి కొరకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తులు చేసిన వారందరూ ఆన్లైన్ హార్డ్ కాపీలను ఎంపీడీవో కార్యాలయంలో అందించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ దరఖాస్తుదారులను కోరారు. రవాణా రంగం, ద్విచక్ర వాహనములు, మూడు చక్రవాహనములు, పశుసంవర్ధక శాఖ పథకం, పాడి గేదలు వ్యవసాయ పథకం, సౌర విద్యుత్ మోటార్ పంప్ సెట్, పలు రంగాలలో ఉపాధి కొరకు దరఖాస్తులు చేసుకున్న వారందరూ ఆన్లైన్ కాఫీ లను ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తుదారులందరూ అందించాలని ఎంపిడిఓ కోరారు. ఈ విషయాన్ని గమనించి వెంటనే ఆన్లైన్ ప్రజ లను సమర్పించాలని దరఖాస్తుదారులను కోరారు. నిర్దిష్ట గడువు లోపు ప్రతులను సమర్పించని అభ్యర్థులు ఎస్సీ కార్పొరేషన్ యూనిట్లకు అనర్హులవుతారని ఎంపీడీవో పేర్కొన్నారు.

## మొక్కజొన్న రైతులకు మద్దతు ధర ప్రకటించాలి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల వ్యాప్తంగా ఈ సీజన్లో మొక్కజొన్న పంట అధికంగా పడింది. రైతులు ఎండనక వాననక అధిక పంట పండే విధంగా కష్టపడ్డారు. మండల వ్యాప్తంగా మొక్కజొన్న ఎక్కువ విస్తీర్ణంలో రైతులుపండించారు. గత వారం పదిరోజులుగా రైతులు కోసిన మొక్కజొన్న పంటను కల్లాల్లో ఆరబెట్టుకుని విక్రయించడానికి సిద్ధంగా ఉంచారు. గత రెండురోజులుగా వాతావరణంలో మార్పులతో అకాల వర్షాలు కురుస్తాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, దళారులకు అమ్మలేక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రం ఎర్రుపాలెం సొసైటీ కార్యాలయంలో సోమవారం ఒక కొనుగోలు కేంద్రాన్ని మార్క్‌ఫెడ్ ద్వారా ఏర్పాటు చేసి ప్రారంభించారు. గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వం మొక్కజొన్న రైతులను ఎంతగానో ఆదుకుందని అదే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం కూడా ఇంకా ఎక్కువ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుకు మద్దతు ధరను ప్రకటించి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

## ఆరు గ్యారంటీలు..
## 420 హామీలను విస్మరించిన కాంగ్రెస్



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు..420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించారని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి ఆరోపించారు. మండలం లోని పలు గ్రామాలలో పార్టీ ఆవిర్భావ వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మోసం చేస్తుందని అన్నారు. 47 ఏళ్లలో బీజేపీ అత్యుత్తమ ప్రతిభకలిగిన ప్రధాన మంత్రులను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు అనంతు ఉపేందర్ గౌడ్, రాష్ట్ర నాయకులు షేక్ షర్ఫుద్దీన్, నాయకులు దుర్గారావు, రవికుమార్, కృష్ణారావు, మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, మల్లెబోయిన గోవిందరావు, సూరేపల్లి జ్ఞానరత్నం, సయ్యద్ మోహినుద్దీన్, పుట్టా సత్యనారాయణ, కందరబోయిన వెంకటరమణ, కొదమగుండ్ల స్వామిదాసు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

## -అర్జీలను స్వీకరించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కూసుమంచి మండలం మునిగేపల్లి గ్రామానికి చెందిన కె. నరేందర్ ప్రభుత్వ ఉత్తర్వులు సంఖ్య 58 ప్రకారం ఎస్సి కాలనీలో ఇండ్ల స్థలం క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నానని స్థలం పట్టా మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం మల్లారం గ్రామానికి చెందిన జి. దేవిశ్రీ సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి రెవెన్యూ గ్రామంలో సర్వే నెం. 548లో తమ అత్తమామలకు భూమి ఉందని వారు మృతి చెందారని ఆ తర్వాత తన భర్త కూడా మరణించాడని ఆ భూమి జాతీయ రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని తన భర్తకు రావాల్సిన నష్టపరిహారాన్ని తనకు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఏన్కూరు మండలం బజ్జూరితండా ఒంటిగుడిసె గ్రామ ప్రజలు గ్రామ పరిధిలో గుట్టల నుండి అక్రమంగా జరుగుతున్న మట్టి తవ్వకాలను నిలిపి వేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేశారు. ఆయా దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సత్వరమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జెడ్పిసిఈవో దీక్షారైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన ఆహారంతోనే మెరుగైన జీవన ప్రమాణం

## జిల్లా అదనపు కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డి

**ప్రజాపక్షం/ఖమ్మం వైద్య విభాగం:** నాణ్యమైన ఆహారంతో మనిషి మెరుగైన జీవన ప్రమాణం పొందవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సర్దార్ పటేల్ స్టేడియంలో ఫుడ్‌సేఫ్టీ ఫోకస్‌డేను సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత అవగాహన ర్యాలీ కార్యక్రమం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఆహార భద్రత ప్రమాణాలపై ప్రజలు, ఫుడ్ వ్యాపారుల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు తీసుకుంటున్నప్పటికీ ప్రజల్లో ఆదరణ పొందలేకపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొద్దిసేపు స్టేడియంలో కొంతమందితో ఆహారపు అలవాట్ల గురించి మాట్లాడించారు. ఆహార నాణ్యతకు సంబంధించి నిఖచ్చిగా వ్యవహరించకపోతే భవిష్యత్తులో తీవ్రమైన దుష్ప్రభావాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీని కోసం సంబంధిత శాఖ అధికారులు నిరంతరం ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం కార్యక్రమాన్ని నిర్వహించిన సిబ్బందిని అభినందించారు. అనంతరం సర్దార్ పటేల్ స్టేడియం నుండి ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ర్యాలీ కార్యక్రమం నిర్వహించబడింది. ర్యాలీలో పాల్గొన అధికారులు, ఫుడ్‌సేఫ్టీ సిబ్బంది, ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు,



ఆహార భద్రత ప్రాముఖ్యతను తెలియజేస్తూ నినాదాలు చేశారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఐఏఎస్ ఆదేశాల మేరకు ఫుడ్‌సేఫ్టీ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రామారావు, జిల్లా ఆసుపత్రుల కోఆర్డినేటర్ రాజశేఖర్‌గౌడ్, యువజన, క్రీడా శాఖ అధికారి సునీల్‌రెడ్డి, జిల్లా ఫుడ్‌ఇన్స్‌పెక్టర్ కిరణ్‌కుమార్, సూపర్‌వైజర్ జడ్ఎస్ జయపాల్, బిట్టా ప్రవీణ్‌కుమార్, ఫుడ్‌సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించేందుకు ఫుడ్‌సేఫ్టీ ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పలువురు అధికారులతో పాటుగా ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం : యంగల

**ప్రజాపక్షం/ బోనకల్ :** సమస్యల పరిష్కారం కోసం పోరాటాలే శరణ్యమని సిపిఐ బోనకల్ మండల కార్యదర్శి యంగల ఆనందరావు అన్నారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం సిపిఐ ఇంటింటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానాల్లో ప్రజలకు ఇచ్చిన 6గ్యారంటీలను చట్టబద్ధత కల్పించాలని, వాటిని పకడ్బందీగా అమలు పర్చాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ కార్మిక చట్టాలను రద్దు చేసి రైతులకు వ్యవసాయ కార్మికులకు వ్యతిరేకమైన చట్టాలను అమలు చేయాలని చూస్తుందని అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని, అందులో భాగంగానే మహాత్మాగాంధీ పేరును ఉపాధి హామీ



పథకం నుంచి తొలగించారని తెలిపారు. రాష్ట్రంలోకి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రెండున్నర సంవత్సరాలు అవుతున్నా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో విఫలమైందని ఆయన అన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రం తక్షణమే బోనకల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని, సాగు, తాగునీరు కోసం సాగర్ జలాల ద్వారా మండలంలోని అన్ని చెరువులను నీటితో నింపాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అనేక సమస్యలతో ప్రజలు కొట్టుమిట్టాడుతున్నా పాలక ప్రభుత్వాలు పట్టించకోవటం లేదని విమర్శించారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రజల పక్షాన ఎల్లవేళలా సిపిఐ పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి బెజవాడ నరేష్, పుల్లయ్య, మల్లాది ధనరాజు, బుంగ నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

# కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థి సంఘం కృషి మరువలేనిది

**ప్రజాపక్షం/ మధిర :** మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధిలో కళాశాల పూర్వ విద్యార్థి సంఘం కృషి అభినందనీయమని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రవీంద్రారెడ్డి అన్నారు. సోమవారం డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధిర డిగ్రీ కళాశాలకు ఎంతో చరిత్ర ఉన్నదన్నారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క కృషితో మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సైన్స్ సెక్షన్లు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. అంతేకాకుండా కళాశాలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పూర్వ విద్యార్థి సంఘం డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క దృష్టికి తీసుకు వెళ్లడంతో మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. కళాశాల సైన్స్ సెక్షన్లు, నూతన భవనాలకు నిధులు మంజూరు చేసిన డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కకి కృతజ్ఞతలు తెలుపుతూ పూర్వ విద్యార్థి




సంఘం ప్రత్యేక తీర్మానం చేసింది. అదేవిధంగా సైన్స్ విద్యార్థుల కోసం ప్రత్యేక ల్యాబ్లు ఏర్పాటు కోసం డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కను కలిసేందుకు నిర్ణయం తీసుకున్నారు. కళాశాలలో మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించేందుకు అవార్డులు ఇవ్వాలని ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి సంఘాన్ని అధ్యాపక బృందం కోరారు. పూర్వ విద్యార్థి సంఘం బాధ్యులు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు మిరియాల అశోక్‌బాబు, పాగి బాలస్వామి, ప్రధాన కార్యదర్శి షేక్.జమీర్, కోశాధికారి బొగ్గుల మధుసూదన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ జి.అరుణ, కెరీర్ గైడెన్స్ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ఇందిర, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ సుజాత, అధ్యాపకులు, పూర్వ విద్యార్థి సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధిలో వార్డు మెంబర్ల పాత్ర కీలకం



**ప్రజాపక్షం/ తల్లాడ :** వార్డు సభ్యుల శిక్షణా తరగతుల రెండవ బ్యాచ్ ప్రారంభోత్సవ కార్యక్రమం స్థానిక రైతు వేదికలో సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఎంపిడిఓ శ్రీధర్‌రాజు, ఎంపిఓ సురేష్‌బాబు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాల అమలులో వార్డు సభ్యుల పాత్ర కీలకమని, ఈశిక్షణ ద్వారా వారు తమ విధులు, బాధ్యతలు, పంచాయతీరాజ్ చట్టాలు, ప్రభుత్వ పథకాల అమలు తీరుపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ శిక్షణా తరగతుల్లో పలు గ్రామాల వార్డు సభ్యులు, ట్రైనీలు ఉత్సాహంగా పాల్గొన్నారు. శిక్షకులు వార్డు సభ్యులకు ప్రభుత్వ పథకాలు, గ్రామసభ నిర్వహణ, నిధుల వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# గాలికుంటు వ్యాధి నివారణ శిబిరం



**ప్రజాపక్షం/మధిర :** మధిర మండలంలోని రామచంద్రాపురం, సిద్దినేనిగూడెం, మల్లారం, నక్కలగరుబు, రొంపిమళ్ల, మధిర పట్టణం తదితర గ్రామాల్లో సోమవారం నిర్వహించిన గాలికుంటు వ్యాధి నివారణ శిబిరం విజయవంతమైంది. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరాన్ని రామచంద్రాపురంలో సర్పంచ్ మేదరమెట్ల లీలావతి ప్రారంభించారు. ఈ శిబిరంలో పాడి పశువులకు వైద్య పరీక్షలు చేసి చికిత్సలు అందించారు. అనంతరం పశువులకు గాలి కుంటు నివారణ టీకాలను వేశారు. ఈసందర్భంగా రైతులకు పశువైద్య సిబ్బంది పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మోటమర్రిలో ఉచిత పశువైద్య శిబిరం



**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల పరిధిలోని మోటమర్రి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత గాలికుంటు నివారణ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ మర్రి సురేష్ ప్రారంభించగా వైద్యాధికారి పశువులకు వైద్యచికిత్సలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# మధిర డిపోను సందర్శించిన ఎండి నాగిరెడ్డి



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని టిజిఎస్‌ఆర్‌టిసి డిపోను వైస్‌చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి(ఐపిఎస్) సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మధిరలో నిర్మాణంలో ఉన్న నూతన బస్టాండ్ పనులను పరిశీలించి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం తాత్కాలిక బస్టాండ్, డిపో గ్యారేజిని సందర్శించి నిర్వహణ విధానంపై సంబంధిత అధికారులకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జోన్ ఈడి పి.సోలోమన్, ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ.సరిరామ్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, మధిర డిపో మేనేజర్ ఆర్.రామయ్య, డిపో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం లారీ బోల్తా .. ఒకరి మృతి



**ప్రజాపక్షం/ తల్లాడ :** ప్రమాదవశాత్తు ధాన్యంతో వెళ్తున్న లారీ బోల్తాపడిన ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన తల్లాడ మండల పరిధిలోని వెంగన్నపేట గ్రామ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంగన్నపేట గ్రామంలో ధాన్యం కొనుగోలు చేసి లారీలో లోడ్ చేసుకుని వెంగన్నపేట గ్రామం నుంచి రాజమండ్రికి వెళ్తున్న క్రమంలో గూడూరు, మిట్టపల్లి గ్రామ సమీపంలో ఉన్న వంతెన వద్ద లారీ బోల్తా పడింది. దీంతో లారీ క్లీనర్ మడక జోగేశ్వరరావు(38) అక్కడికక్కడే మృతి చెందాడు. అసంపూర్తిగా వంతెన నిర్మాణం దీనికి తోడు ప్రత్యామ్నాయం రోడ్డు లేకపోవడంతో ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించడానికి సరైన స్థలం లేకపోవడంతో ఈ ఘటన చోటు చేసుకుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా లారీ డ్రైవర్ సాలెపు సంతోష్‌కుమార్ మద్యం మత్తులో ఉండటంతో ఈ ఘటన చోటు చేసుకోవటంలో ప్రధాన కారణంగా స్థానికులు తెలిపారు. మృతుడు అనకాపల్లి జిల్లా మడకపాలెం గ్రామానికి చెందిన వ్యక్తి గుర్తించినట్లు, మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్త ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల కేంద్రం ఎర్రుపాలెం సొసైటీ నందు పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మధిర ఎఎంసి చైర్మన్ బండారు నర్సింహారావు సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ప్రభుత్వం రైతు సంక్షేమం కోరి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు ఇచ్చిన మాటకు కట్టుబడి పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటుందని అన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఇఓ శివారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఆత్మ కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## బీటీ రణదీవె, ఎర్ర శ్రీకాంత్ వర్ధంతి సభ



**ప్రజాపక్షం/కారేపల్లి:** స్థానిక హమాలి అడ్డాలో ఆరెల్లి శ్రీరాములు అధ్యక్షతన బీటీ రణదీవె, ఎర్ర శ్రీకాంత్ వర్ధంతి సభ నిర్వహించారు. ఈసందర్భంగా సిఐటియు సింగరేణి మండల కన్వీనర్ కె నరేంద్ర మాట్లాడుతూ కార్మిక ఉద్య మానికి బీటీ రణదీవె చేసిన సేవలు అపారమని, ఎర్ర శ్రీకాంత్ కార్మిక వర్గం కోసం కడవరకు పోరాడారని అన్నారు. కార్మిక చట్టాల మార్పు లతో కార్మిక హక్కులు దెబ్బతింటుటన్నాయని విమర్శిస్తూ, వారి ఆశయాల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అనంతరం బీటీ రణదీవె, ఎర్ర శ్రీకాంత్ చిత్రపటా లకు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు కె లోతు రవి, ఆరెల్ల శ్రీరాములు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో ముక్కా సీతారాములు, ముండ్ల ఏకాంబరం, తురక సంపత్, తిరపయ్య, సైదులు, బాబు, కోటయ్య, అనుకల నగేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఇవిఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** జిల్లా కేంద్రంలోని ఆర్‌డిఓ కార్యాలయ ఆవరణలో ఉన్న ఇవిఎం గోదాముని జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం తనిఖీచేశారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పా ట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట ఎన్నికల ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రతీనెల నిర్ధిష్టమైన తనిఖీలు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. సిసి కెమెరాల పనితీరు, రికార్డు వ్యవస్థను స్వయంగా పరిశీలించారు. గోదాము ప్రాంతం నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని, భద్రతా నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎన్నికల సూపరింటెం డెంట్ రంగా ప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని సూర్యఘర్ ముక్తి బిజిలీ యోజనను సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** ప్రధాని సూర్యఘర్ ముక్తి బిజిలీ యోజనను అర్హులైన ప్రజలు సద్వి నియోగం చేసుకోవాలని కలెక్టర్ అంకింత్ అన్నారు. సోమవారం ఐడిఓసిలో ఈ పథకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇండ్ల పై భాగంలో సోలార్ ప్లేట్లు ఏర్పాటు చేసు కోవడం ద్వారా విద్యుత్ ఖర్చును తగ్గించుకోవచ్చన్నారు. దీని వల్ల పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని, కార్బన్ ఉద్గారాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అద నంగా వినియోగించని విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసి తిరిగి ఆదాయం పొందవచ్చ న్నారు. ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా ఒక కోటి కుటుంబాల వారికి 300 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం ఈ పథకం లక్ష్యం అన్నారు. ఇందు కోసం పిఎంఎస్‌యుఆర్య ఘర్.గవ్.ఇన్ లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, టిజిఎస్‌పిడిఎస్‌ఎల్ ఎస్సీ మహేందర్, టిజిఆర్ఇడిసిఓ జిల్లా మేనేజర్ అజయ్ కుమార్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పాలవాగు ఆదివాసులకు సోలార్ లైట్లు పంపిణీ

### -సేవా కార్యక్రమంతో మెరుగైన జీవనానికి వెలుగులు



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండలం లోని పాలవాగు ప్రాంత వలస ఆదివాసు లకు వెలుగులు నింపే కార్యక్రమం నిర్వ హించారు. రాబిన్ హుడ్ ఆర్మీ సహకా రంతో సుమారు రూ 1లక్షల విలువైన సోలార్ విద్యుత్ దీపాలను 50 కుటుం బాలకు పంపిణీ చేశారు. ములకలపల్లి గ్రామానికి చెందిన పుష్పాల కుటుంబ సభ్యులు తమ తల్లి పుష్పాల ఇందిరమ్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా పాలవాగు ప్రాంతంలోని రెండు గుంపుల ఆదివాసులకు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహిం చారు. ఈప్రాంతంలో సుమారు 50ఇళ్లకు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో వారు చీకటి లోనే జీవనం సాగిస్తున్నారని తెలుసుకుని, హైదరాబాద్‌కు చెందిన రాబిన్ హుడ్ ఆర్మీ సంస్థను సంప్రదించి వారి సహకారంతో ప్రతి ఇంటికి సోలార్ లైట్లు అందజేశారు. అదే విధంగా ప్రతి కుటుంబానికి 10 రోజులకు సరిపడి బియ్యం, పప్పు, నూనె తదితర నిత్యావ సర వస్తువులను కూడా పంపిణీ చేశారు. ఈసందర్భంగా వైరా ప్రస్తుత ఎస్ఐ పుష్పాల రామారావు మాట్లాడుతూ మా తల్లిదండ్రుల జ్ఞాపకార్ధం పలు సేవా కార్యక్రమాలు నిర్వహి స్తున్నాము, అందులో భాగంగా మా మాతృమూర్తి పుష్పాల ఇందిరమ్మ ద్వితీయ వర్ధంతిని ఆదివాసుల మధ్య జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మౌలిక సౌకర్యాల లోపంతో ఇబ్బందులు పడుతున్న పాలవాగు ఆదివాసులకు సోలార్ దీపాలు, నిత్యావస రాలు అందించడం మా కుటుంబానికి తృప్తి నిచ్చిందన్నారు. భవిష్యత్తులో కూడా వారికి మా కుటుంబం అండగా ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో గుండాలపాడు సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు, రాబిన్ హుడ్ ఆర్మీ ప్రతినిధులు రమేష్, కిరణ్, పుష్పాల కుటుంబ సభ్యులు వెంకన్న, చందర్‌రావు, సాయి, ఐద్వ నాయకురాలు సందకురా లక్ష్మి, మండల ప్రముఖులు నూపా భాస్కర్, బండి కొమరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థులు చదువులతో పాటు కళలపై దృష్టి సారించాలి

### ఐటిడిఏ పిఓ రాహుల్

**ప్రజాపక్షం/భద్రాచలం :** గిరిజన విద్యార్థులు చదువులతో పాటు ఇష్టమైన కళల పట్ల ఆసక్తి పెంచుకుని దృష్టి సారించాలని ఐటిడిఏ పిఓ రాహుల్ అన్నారు. గిరిజన గురుకుల కళాశాల ఖమ్మంలో బిఏ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఇర్పా స్వామి వేసిన పెయింటింగ్ చిత్రాలను తన చాంబర్లో పిఓ రాహుల్ సోమవారం ఆసక్తిగా తిలకించారు. స్వాతి చదువుకుంటూ పెయింట్‌గ్‌గై మక్కువ పెంచుకోవడం గర్వకారణం అన్నారు. ఆమె చేతి ద్వారా గీసిన చిత్రాలు అద్భుతంగా ఉన్నాయని, ఈచిత్రాలను ట్రైబల్ మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచుతామని తెలిపారు. అనంతరం ఖమ్మం డిగ్రీ కాలేజీ అభివృద్ధికి రూ.2 లక్షల చెక్కును, స్వాతి గీసిన చిత్రాలకు గానూ రూ.22,500 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో గురుకులం ఆర్‌సిఓ అరుణకుమారి, గురుకుల కళాశాల ప్రిన్సిపల్ రజని, కళాశాల టీమ్ లీడర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



## పరిశుభ్రంగా పోలిశెట్టిగూడెం...

**- ప్రజాపక్షం కథనానికి స్పందన**




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని పోలిశెట్టిగూడెం గ్రామంలో నెలకొన్న పారిశుధ్య సమస్య లపై ప్రజాపక్షంలో ప్రచురిత మైన కథనానికి గ్రామ సర్పంచ్ కళ్లెం జాన్‌రెడ్డి తక్ష ణమే స్పందించారు. గ్రామంలో పారిశుధ్యం అస్త వ్యస్తంగా ఉందని వెలువడిన వార్త అనంతరం, పారిశుధ్య లోపం ఉన్న ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన శుభ్రత పనులు చేపట్టారు. ఈ పనులను పంచాయతీ కార్యదర్శి రజిత స్వయంగా పరిశీలిస్తూ, పారిశుధ్య కార్మికు లకు అవసరమైన సూచనలు, సలహాలు అంద జేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లా డుతూ...గ్రామంలో కొన్ని సమస్యలు ఉన్నప్ప టికీ పత్రిక ద్వారా అవి వెలుగులోకి రావ డంతో వెంటనే చర్యలు తీసుకొని శుభ్రత పనులు పూర్తి చేయించినట్లు తెలిపారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నిరం తరం చర్యలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై స్పందించేందుకు తానె ప్పుడు ముందు వరసలో ఉంటానన్నారు.

## కలెక్టర్‌కు తీర్థాల గ్రామస్థుల వినతి

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని తీర్థాల గ్రామంలో నెలకొన్న సమస్యలపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టిని తీర్థాల గ్రామస్థులు సోమవారం గ్రీవెన్స్‌డేలో కలిసి వినతిపత్రాన్ని అంద జేశారు. పల్లెగూడెం,మంగళగూడెం రోడ్డు పనులు చేపట్టి రెండున్నర సంవత్సరాలు కావోస్తున్న అసంపూర్తిగానే ఉన్నాయన్నారు. సైడ్ డ్రైన్‌ది సైతం అదే పరిస్థితిగా పేర్కొన్నారు. ఈ క్రమంలో రెండు వైపుల పంచా యతీ వాటర్ పైప్‌లైన్ చాలా చోట్ల డామేజ్ అయ్యిందన్నారు. ఈ విష యంపై కాంట్రాక్టర్‌కు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా 11కేవీ కరెంట్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నా యని, జరగరాని జరిగితే ప్రాణాలకే ముప్పుంద న్నారు. స్పందించిన కలె క్టర్ తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచిం చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలునాయక్, బీఆర్ఎస్ నాయకుడు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



## సాయం కోసం ఎదురుచూపు..!

**చేయి చేయి కలుపుదాం..**
**రెండు నిండు ప్రాణాల్ని కాపాడుదాం.. రండి..**
**తాడువాయి వెళ్లి వస్తుండగా ఆటో బోల్తా పడడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలు..**



**ప్రజాపక్షం/కరకగూడెం:** చేయి చేయి కలిపి ఎంద రికో దాతలు సాయం చేసి ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకుంటున్నారు. అదే విధంగా మాకు దాతలు సాయం చేసి అదు కుంటారు. గోగు రజిత బ్రతికించుకోవాలి అంటూ నా బిడ్డను బ్రతికించా లంటూ రజిత ప్రాధేయపడు తున్నారు. ఈ విషయంపై వారు ప్రజా పక్షంతో వారు తమ బాధను విన్నవించుకున్నారు.... మండల పరిధిలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన గోగు రజిత మూడు సంవ త్సరాల క్రితం తాడువాయి గ్రామానికి చెందిన వారిని పెళ్లి చేసుకోగా భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. అక్కడ ఉంటానికి ఇల్లు లేక తల్లి గారింటికి వచ్చి చిన్న గుడిసె కట్టుకొని దాంట్లో జీవిస్తున్న గోగు రజి తకు ఇద్దరు ఆడపిల్లలు. తాడువాయి ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా ఆటో బోల్తా పడి తీవ్రంగా గాయాలు కావడంతో వరంగల్ ఎంజీఎం కు తర లించారు. పాపకు సీరియస్ గా ఉండటంతో హైదరాబాద్ ఒక ప్రైవేట్ హాస్పటల్ తీసుకెళ్లారు. డబ్బుల్లేక చాలా ఇబ్బంది పడుతున్నారు.

### దయచేసి ఆదుకోగలరని ప్రార్థిస్తున్న రజిత...

రెక్కాడితే డొక్కాడని బ్రతు కులు కావడంతో ప్రతి రోజు కూలీ పను లకు వెళ్లి జీవనం సాగించే వారు, నా పాపను కాపాడండి అంటూ రజిత మెద దుకు పెద్ద గాయం కావడంతో వరంగ ల్ లోని ఎంజీఎం హాస్పటల్ కు తరలించిన సీరియస్‌గా ఉండటంతో హైదరాబాద్ ప్రైవేట్ హాస్పిటల్ లో చిక్సిత అందిస్తున్నారు. అక్కడి వైద్యులు మెద దుకు ఆపరేషన్ చేయాలని సుమారు రూ. లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారని, ఏం చేయాల్లో తెలియని పరిస్థితిలో మా కుటుంబా నికి దాతలు ఆదుకోని మా పాపని బ్రతికించా లని వేడు కుంటున్నారు. చేయి చేయి కలిపి... ఆదుకోవాలని దాతలను గ్రామస్తులు సైతం విన్న వించుకుంటున్నారు. రజిత కు కనీసం తల్లిదం డ్రులు కూడా లేరు, లేని అనాథలా కాకుండా చూడాలని కనిపించిన ప్రతి ఒక్కరి కాళ్లపై పడుతుంది. సహాయం చేయదలసిన వారు ఫోన్ పే ద్వారా తమ వంతుగా సాయం అందించాలని 9573034048 కు నెంబరు సంప్రదించాలని కన్నీటితో వేడుకుంటున్నారు.

## కొమరం భీమ్, అంబేద్కర్ విగ్రహాల నిర్మాణానికి అనుమతికి వినతి

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మండల కేంద్రములోని సర్వే నంబరు 484లో గల కొమరం భీమ్ కమ్యూనిటీ హాల్ స్థలంలో ఆదివాసుల ఆశాజ్యోతి కొమరం భీమ్, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్ర హాల నిర్మాణానికి అనుమతి మంజూరు చేయాలని ఆదివాసీ ఐక్య కార్యాచరణ సమితి ఆళ్లపల్లి మండల శాఖ జిల్లా కలెక్టర్‌కు పాత్రినిధ్య లేఖను అందజేశారు. జిల్లా కలెక్టర్ ఈ విషయంపై సానుకూలంగా స్పందించినట్లు సమితి మండల అధ్యక్షులు పాయం రమేష్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2015 సంవత్సరం నుండి ఇదే ప్రదేశంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం, కొమరం భీమ్, బీర్సా ముండా వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. కాబట్టి ఎటువంటి ఆలస్యం లేకుండా విగ్రహాల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని వినతి పత్రంలో కోరారు. ఈకార్యక్రమంలో కొమరం వెంకట కృష్ణంరాజు, గొగ్గల గాదెరాజు, ఏడూళ్ల రమేష్, కొమరం సతీష్, కొమరం బన్ని, తదితరులు పాల్గొన్నారు.



## పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి..



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ఆంకిత్



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిం చాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ఆంకిత్ సిబ్బందికి ఆదేశిం చారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాలను, విభాగాల పనితీరును సమగ్రంగా పరిశీలించిన కలెక్టర్, అందిస్తున్న వైద్య సేవల నాణ్యతపై ప్రత్యేకంగా దృష్టి సారిం చారు. మొదటగా ఇన్‌పేషెంట్ వార్డును సందర్శించిన కలెక్టర్, అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న చికిత్స, వైద్య సిబ్బంది స్పందనపై వివరాలు తెలుసుకు న్నారు. రోగులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సేవలు అందిం చాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఔట్‌పేషెంట్ విభాగాన్ని పరిశీలిం చిన కలెక్టర్, అక్కడికి వచ్చిన రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఒక వృద్ధుడు తనకు ఎవరూ లేరని, ప్రమాదంలో కాలు కోల్పోయినట్లు తెలియజేస్తూ సహాయం కోరగా, కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. వెంటనే సంబంధిత అధికారులకు ఆ వృద్ధుడి పూర్తి వివరాలు సేకరించి, కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి అవసరమైన మెరు గైన వైద్య చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇన్‌పేషెంట్ విభాగంలో వడదెబ్బ కేసులు నమోదవుతున్నట్లు గుర్తించిన కలెక్టర్, వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసు కోవాల్సిన అవసరాన్ని పేర్కొన్నారు. ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలలో భాగంగా మండల పరిధిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఎంపీ డీవోకు ఆదేశించారు. ఇప్పటికే ఆలస్యమైనందుకు కారణాలు అడిగి తెలుసుకుని, తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో ఔషధ నిల్వ గదిని సమగ్రంగా పరిశీలించిన కలెక్టర్, స్టాక్ రిజిస్టర్‌లో నమోదైన ఔషధాల వివరాలు, వాస్తవ నిల్వలను సరిపోల్చి పరిశీలిం చారు. ఔషధాల నిల్వలు సరిపడా ఉన్నాయా లేదా అనే విషయంపై అధి కారులను ప్రశ్నించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్న మందులు ఎంతో విలువైనవి అని, వాటిని పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని, బహిరంగ మార్కెట్లో విక్రయాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవ కాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను కూడా తనిఖీ చేసిన కలెక్టర్, విధుల్లో ఉన్న సిబ్బంది హాజరు, వారి బాధ్యతలు, సేవల సమయపాలనపై వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ప్రతి సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, నిర్లక్ష్యం సహించ బోమని హెచ్చరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించే ముఖ్య కేంద్రాలని, ఇక్కడ అందించే సేవల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి రోగులకు సమయానుకూలంగా సేవలు అందించాలని, అత్యవసర పరి స్థితుల్లో వెంటనే స్పందించే విధంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. అవసరమైన అన్ని ఔషధాలు, వైద్య పరికరాలు ఎప్పటికప్పుడు అందుబా టులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. వేసవి కాలంలో వడదెబ్బలు, నీరసం వంటి సమస్యలు ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నందున అవసరమైన మందులు ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని, ప్రజలకు తగిన జాగ్రత్తలు సూచించాలని అధి కారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట తహసిల్దార్ శ్రీని వాస్, ఎంపీడీవో రవి, మెడికల్ అధికారి వెంకటేశ్వర్లు, స్టాఫ్ నర్స్, సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బీజేపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పట్టణ, మండల స్థాయిలో సోమవారం భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వ హించారు. పార్టీ నాయ కులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్న ఈ వేడుకలు పట్టణ శాఖ అధ్యక్షుడు బానోతు విజయ్, మండల పార్టీ అధ్యక్షుడు సాలి శివకృష్ణ ఆధ్వర్యంలో జరిగాయి. పట్ట ణంలోని పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ చేసి, మిఠాయిలు పంపిణీ చేస్తూ వేడుకలు నిర్వహించారు. అదే విధంగా కిష్టాపురం, పాక లగూడెం, గంగారం, కాకర్లపల్లి, రేజర్ల గ్రామాల్లో వేడుకలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు సుదర్శన్ మిశ్రా, భాస్కర్ల వీరం రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావులు మాట్లా డుతూ భారతీయ జనతా పార్టీ రెండు స్థానాలతో ప్రారంభమై తన రాజ కీయ ప్రస్థానాన్ని నేడు దేశంలోని అనేక రాష్ట్రాల్లో అధికారంలో కొనసా గిస్తూ విశాల స్థాయికి చేరుకుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో ప్రధాన కార్యదర్శి వేముల లక్ష్మీనారాయణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆచంట నాగస్వామి, సీనియర్ నాయకులు మన్నేని నరసింహమూర్తి, ఆచంట సుబ్రమణ్యం, వందనపు భాస్కరరావు, పమ్మి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

### తల్లాడలో...



**ప్రజాపక్షం/ తల్లాడ :** భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినో త్సవం సందర్భంగా తల్లాడ మండలం బిజెపి అధ్యక్షులు చల్లా నాగులు ఆధ్వర్యంలో సోమవారం వేడుక లను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా తల్లాడలో జెండా ఆవి ష్కరణ నిర్వహించారు. జెండా ఆవిష్కరణ అనంతరం స్వీట్లు పంపిణీ చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ నెంబర్ గాదె కృష్ణారావు, జిల్లా నాయకులు ఆపతి వెంకటరామారావు, ప్రధాన కార్య దర్శి రాయల రమేష్, పెరిక కిరణ్, ట్రెజరీ యద్దనపూడి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు గొల్లమండల నరేష్, కార్యదర్శి చల్లా నరేష్, ఎస్సీ మోర్చా వేము అశోక్, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు నాగేశ్వరరావు, సత్య నారాయణ, బస్విరెడ్డి, సంతోష్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### చింతకానిలో..



**ప్రజాపక్షం/చింతకాని :** భాజాపా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు చింతకాని మండల వ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వ హించాయి. నాగులవం చలో జరిగిన కార్యక్ర మంలో పార్టీ మండల అధ్యక్షుడు కొండా గోపి పార్టీ జెండాను ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శులు ఇమ్మడి సత్యనారాయణ, గోదా మంగయ్య, సీనియర్ నాయకులు కొరి పల్లి శ్రీను, మద్దిన్ని వెంకటేశ్వర్లు, చెన్నూరి నాగాచారి, జిల్లా కౌన్సిల్ మెంబర్ అవులూరి శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ సిద్ధ మియా, ఉపాధ్యక్షులు బక్క సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### అశ్వాపురంలో...



**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండలంలోని మొండి కుంటలో బీజేపీ 47వ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొడియం బాలరాజు జెండా ఆవిష్కరించి, పార్టీ అభివృద్ధిపై మాట్లాడారు. మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ముస్సు శ్రీనివాస రెడ్డి పార్టీ సిద్ధాంతాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయ కులు తాటిపాముల ఐలయ్య, సోమ కృష్ణకుమారి, సురకంటి లింగా రెడ్డి, కొల్లు లింగారెడ్డి, గోసుల రాములు, మాదిరెడ్డి వెంకటరెడ్డి, కడ మంచి రాజేష్, పసునూరి రమేష్, గాదె శ్రీకాంత్, పోతోజు మురళి, ఆవుల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ




**ప్రజాపక్షం/అశ్వాపురం:** మండలంలోని రైతు వేదికలో తహసీల్దార్ మణిధర్ అధ్యక్ష తన నిర్వహించిన కళ్యాణ లక్ష్మి, షాదీముబా రక్ చెక్కుల పంపిణీ ముఖ్యఅతిథిగా పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల ఆడపడుచులకు వివాహ సమయంలో ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం మండలంలోని 39 మంది లబ్దిదారులకు మొత్తం రూ 39,04,524 విలువైన చెక్కులను అందజేసి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో ముత్యాలరావు, మండల అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య, సీనియర్ నాయకులు గాదె కేశ వరెడ్డి, ఓరుగంటి రమేష్, యూత్ వైస్ ప్రెసిడెంట్ గొల్లపల్లి నరేష్, ప్రజాప్రతినిధులు, అధి కారులు, నాయకులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

## చిన్నారులను ఆశీర్వదించిన శ్రీలత



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సోంపల్లి గ్రామ పంచా యితీ పరిధిలోని గంగ్రగోడ్డలిపల్లి గ్రామంలో బర్ల బాలకృష్ణ, శ్యామల దంపతుల కుమారులు మహీ ధర్ గోవర్ధన్, లోహిత్ వర్ధన్‌ల పంచకట్టు వేడుకను కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. సంప్రదాయబ ద్ధంగా జరిగిన ఈ వేడుకలో చిన్నారులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈకార్యక్రమా నికి బూర్గంపాడు మండల మాజీ జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత హాజరై చిన్నారులకు ఆశీ స్సులు అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయా లను ప్రతిబింబించే పంచకట్టు వంటి వేడుకలు కుటుంబ బంధాలను మరింత బలపరుస్తా యని తెలిపారు. మహీధర్ గోవర్ధన్, లోహిత్ వర్ధన్‌లు మంచి విద్యాభివృద్ధితో ఉన్నత స్థానా లకు ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు బోరెం శ్రీను, ధన గురి నాగేశ్వరరావు, ప్రజాపక్షం రిపోర్టర్ బర్ల జోషి, ఆంధ్రప్రభ రిపోర్టర్ జక్కిరెడ్డి మల్లా రెడ్డి, నడిపింటి వెంకయ్య, సంగం ప్రశాంత్‌తో పాటు గ్రామ పెద్దలు, బంధుమిత్రులు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంఎల్ఏ



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురె డ్డిపల్లి మండలంలో ఎంఎల్ఏ జారే ఆదినారాయణ పలు అభివృద్ధి కార్యక్ర మాల్లో పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన సమావేశంలో కళ్యాణ లక్ష్మి, షాదీము బారక్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని పలు గ్రామాలలో ఉన్నటువంటి పాఠశాలలకు పంచాయితీ రాజ్ డిపార్ట్మెంట్ నుండి మంజూరైన ప్రహరీ గోడలకు నిర్మాణాలకు సంబం ధించిన సుమారు 45లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తదుపరి అబ్బుగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పాలిటి పెన్నిధి అని ప్రతి పేదవాడికి ప్రభుత్వ ఫలాలను అందించే దిశగా నా అన్నపురెడ్డిపల్లి మండలంలో ఎంతగానో అభివృద్ధి చేసే దిశగా నా వంతు కృషిని చేస్తానని, అందరూ కూడా సమన్వయంతో సమిష్టిగా పని చేయాలని అధికారులకు సమిష్టిగా పని చేయాలని అధికారులకు కార్యకర్తలకు నాయకు లకు తగిన సూచనలు సలహాలు చేశారు. ఈకార్యక్రమంలో అన్నపురెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ లాకావత్ లక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ ఈదర జగదీశ్వరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పరసా వెంకటేశ్వర్లు, బాణావత్ భీముడు, భీమిరెడ్డి వెంకటరెడ్డి, అబ్బుగూడెం సర్పంచ్ రాము, మరకల లక్ష్మారెడ్డి, తిరుపతిరావు, నెలపాటి శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు పరిశీలించాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/భద్రాచలం :** ప్రజావాణిలో వచ్చిన ప్రతీ దరఖాస్తును పరిశీలించి పరిష్కరించా లని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం ఐడిఓసిలో నిర్వహించిన ప్రజావాణి కార్య క్రమానికి హాజరైన ఆయన జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన ప్రజల నుండి విన్న పాలు స్వీకరించి పరిశీలించారు. అనంతరం వాటిని ఆయా శాఖల అధికారులకు పంపిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యయ ప్రయాసలకు ఓర్చి సుదూర ప్రాంతాల నుండి ప్రజలు వారి సమస్యల పరిష్కారం కోసం అధికారుల పై నమ్మకంతో ఇక్కడి దాకా వచ్చి వినతులు అందిస్తుంటారని, వారి నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా అధి కారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. పరిష్కారానికి నోచుకోని వాటిపై సమగ్ర నివేద కలు వెంటనే అందించాలని ఆదేశించారు. వచ్చిన ప్రతీ దరఖాస్తును రిజిస్టర్‌లో నమోదు చేసి ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సూచించారు.

**భద్రాచలం ఐటిడిఏలో :** గిరిజన దర్బారులో గిరిజనులు స్వయం ఉపాధి కోసం మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని ఐటిడిఏ పిఓ రాహుల్ సూచించారు. ఐటిడిఏ సమావేశ మంది రంలో నిర్వహించిన గిరిజన దర్బారులో పలు ప్రాంతాల నుండి వచ్చిన గిరిజనుల నుండి విన్నపాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతీ గిరిజన కుటుంబానికి ప్రభుత్వ పథకాలు ప్రాధాన్యతా క్రమంలో అందిస్తామని చెప్పారు. వచ్చిన ప్రతీ దరఖాస్తును పరిశీలించి పరిష్కారానికి ఐటిడిఏ యూనిట్ల అధికారులు పాటుపడాలని, గిరిజనుల మేలు చేసేందుకు ఏర్పాటు చేసిన ఐటిడిఏలు అబాసు పాలు కాకుండా చూడా ల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# నిర్విరామ సేవలకు ధన్యవాదాలు : కలెక్టర్



## -ఉద్యోగ విరమణ పొందిన వారికి ఘనంగా వీడ్కోలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజలకు నిర్విరామంగా సేవలు అందించి పదవి విరమణ పొందిన ఉద్యోగులకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మార్చి నెలలో పదవి విరమణ పొందిన ఎనిమిది మంది ఉద్యోగుల కోసం సోమవారం ప్రజావాణి అనంతరం ఏర్పాటు చేసిన వీడ్కోలు సన్మాన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్లు డా॥ పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డిలతో కలిసి ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఖమ్మం బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన అరుణ్ కుమార్, మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన బి. జయరాజ్, డిఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో డిపిఎంవోగా పనిచేసిన ఎండి అఫ్జల్‌మియా, ఎంపిహెచ్‌ఈవోగా పనిచేసిన ఎంవి నర్సింహారావు, ట్రైబల్ శాఖ పరిధిలో హెచ్‌పిగా పనిచేసిన ఎస్‌కె ఆసిఫ్‌మియా, హౌజింగ్ శాఖ కొణిజర్ల ఏఈగా పనిచేసిన ఐ. ఉమేశ్వర్, రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయంలో చైన్‌మ్యాన్‌గా పనిచేసిన డి. అమృతమ్మ, ఎస్సి సంక్షేమ శాఖ పరిధిలో ఓఎస్‌గా పనిచేసిన డి.ఎలిశమ్మ పదవి విరమణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 35 ఏళ్ల పాటు ప్రజలకు సేవలు నిర్విరామంగా అందించి పదవి విరమణ పొందిన ఉద్యోగులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పదవి విరమణ అనంతరం జీవితం ప్రశాంతంగా, ఆరోగ్యంగా సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, రిటైర్‌మెంట్ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



## -మొక్కజొన్న కొనుగోలును ప్రారంభించిన ఏఎంసి ఛైర్మన్

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు తెలిపారు. సోమవారం మండల పరిధిలోని మంచుకొండ గ్రామంలో మంచుకొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మొక్కజొన్న రైతులకు మద్దతు ధర రూ. 2,400 కల్పించేందుకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకు నాణ్యమైన పంటను తీసుకు వచ్చి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో తమ పంటను అమ్ముకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ ఛైర్మన్ తల్లాడ రమేష్, సర్పంచ్ శంకర్, సొసైటీ ప్రత్యేకాధికారి ఉషశ్రీ, మార్కెట్ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఏవో ఉమామహేశ్వరరెడ్డి, సొసైటీ కార్యదర్శి శ్రీనివాసరావు, నాయకులు దీప్లానాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్‌ఫీల్డ్ హైవేని నిర్మించారు.. ఆర్అండ్‌బి రహదారిని మరిచారు..!



**ప్రజాపక్షం/ తల్లాడ :** ఖమ్మం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జంగారెడ్డిగూడెం వరకు నిర్మించిన గ్రీన్ ఫీల్డ్ హైవే పనులకు తల్లాడ మండలం కొత్త మిట్టపల్లి నుంచి రామానుజవరం వెళ్లే ఆర్అండ్‌బి రహదారి మీదుగా భారీ వాహనాలతో గ్రావెల్ కంకరను రవాణా చేయగా రహదారి మొత్తం భారీ గుంతలతో అస్తవ్యస్తంగా అధ్వాన్నంగా తయారైంది. ఈ గ్రీన్ ఫీల్డ్ నిర్మాణం కోసం భారీ వాహనాల రాకతో ధ్వంసమైన ఆర్అండ్‌బి రహదారిపై ప్రయాణం చేయాలంటే ప్రయాణీకులకు ప్రాణ సంకటంగా మారింది. అదేవిధంగా ఈ రహదారిలో ప్రయాణిస్తున్న సమయంలో దమ్ముధూళితో వాహనాదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. హైవే పనుల కోసం ఈ రహదారిని అధ్వాన్నంగా తయారు చేసిన అధికారులు ఈ రహదారిని మరమ్మత్తుల చేయకుండా తాత్సారం చేయటం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైవే పనుల వలన అధ్వాన్నంగా తయారైన ఆర్అండ్‌బి రహదారి కొత్త మిట్టపల్లి నుండి రామానుజవరం వరకు నూతనంగా తారురోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిని పూర్తిస్థాయిలో తారు రోడ్డుగా మార్చి వాహనదారుల ఇబ్బందులను తొలగించాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

# ఎమ్మెల్యే నవీన్‌యాదవ్‌కు ఘనసన్మానం



**ప్రజాపక్షం/వైరాః** జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసిన వైరా మండలం తాటిపూడి గ్రామ సర్పంచ్ జవ్వాజి అశ్విని నాగరాజు దంపతులు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా నవీన్ యాదవ్ వారితో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పార్టీ సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలని ఆయన తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో జవ్వాజి పద్మ, జవ్వాజి సైదులు, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

## తెలంగాణ రైతు సంఘం డిమాండ్



**ప్రజాపక్షం/పెనుబల్లిః** ప్రభుత్వం తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర కల్పించాలని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి చిట్టి మోదుల కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పెనుబల్లి మండలంలోని కొత్త కారాయగూడెం గ్రామంలో దాడవా రైతులు చేసిన పంట కల్లాలను సందర్శించారు. దాల్వా వరి పంట నూర్పుళ్ళు ప్రారంభించిన ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకుండ నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని కార్యక్రమానికి రైతులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు పండించిన ధాన్యం దళారీల పాలవుతోందని సరైన ధర లేక పెట్టుబడులు రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం 2200 వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా గతంలో కొనుగోలు చేయడం వల్ల రైతులకు వరి పంట గిట్టుబాటు అయిందని, ప్రస్తుత పరిస్థితుల్లో దళారీలు 1300కు మించి కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారు అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బోసు ప్రసాదు, ముద్దంగుల రాజు, పోట్రు రాజారావు, చిలుకూరు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# వార్డుల్లో అభివృద్ధి పనుల పరిశీలన



**ప్రజాపక్షం/సత్తుపల్లిః** మున్సిపాలిటీ పరిధిలోని 18, 23 వ వార్డులలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ రిహన కమల్ పాషా సోమవారం పరిశీలించారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న తాగునీటి పైపులైన్ పనులు, మురుగు కాలువల శుభ్రపరిచే కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి కొరత లేకుండా పైపులైన్ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్లు మానస రాము, విరివాడ అపర్ణ నాగభూషణం, మున్సిపల్ కమిషనర్ నరసింహ, ఏఈ, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికులకు మజ్జిగ పంపిణీ



**ప్రజాపక్షం/సత్తుపల్లిః** పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని సింగరేణి కార్మికుల ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏరియాలోని అన్ని విభాగాల్లో మజ్జిగ ప్యాకెట్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా జి.ఎం. కార్యాలయ సిబ్బందితో పాటు జెవిఆర్ ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్. ప్రహ్లాద్, కిష్టారం ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏ.ఎల్.ఎస్.వి. సునీల్ వర్మ, జెవిఆర్ సిహెచ్‌పి డిజిఎం (ఈ అండ్ ఎమ్) కె. సోమశేఖర రావు ఆధ్వర్యంలో ఆయా విభాగాల ఉద్యోగులు, కార్మికులకు మజ్జిగ అందజేశారు. పంపిణీ కార్యక్రమం గుర్తింపు సంఘం ప్రాతినిధ్య సంఘాల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా నిర్వహించారు. గనుల్లో, కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది ఎండ తీవ్రతకు గురికాకుండా ఉండేందుకు యాజమాన్యం, కార్మిక సంఘాలు సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. పని ప్రదేశాల్లో చల్లని మంచినీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మజ్జిగను నిరంతరం అందుబాటులో ఉంచుతామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధికారులు, గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రహదారి ఏర్పాటు చేయాలని వినతి



**ప్రజాపక్షం/ మధిర మున్సిపాలిటీ :** మధిర మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌సిఎం చర్చికు చెందిన సమాధుల స్థలానికి సరైన రహదారి లేక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అధికారులు వెంటనే స్పందించి రహదారి ఏర్పాటు చేయాలని ఆర్‌సిఎం చర్చి ఫాదర్ రమేష్ కోరారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం నందు తహశీల్దార్ ఆర్.రాంబాబుకు చర్చి సంఘ పెద్దలు, యువతతో కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాధుల స్థలానికి వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడంతో ప్రస్తుతం ప్రజలు రైల్వే ట్రాక్ దాటి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని, ముఖ్యంగా ఎవరైనా మరణించిన సందర్భంలో అంత్యక్రియలు నిర్వహించడానికి వెళ్లే సమయంలో కుటుంబసభ్యులు, పెద్దలు, మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇటీవల మధిర పరిధిలో మూడవ లైన్ ఏర్పాటు చేయడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాక్ దాటేటప్పుడు ప్రమాదం జరిగే అవకాశం ఉందని, అధికారులు తక్షణమే స్పందించి స్మశానవాటికకు సరైన రహదారి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గండమాల ప్రసాద్, రెంటపల్లి ఫ్రాన్సిస్, నీలం రమేష్, వేల్పుల శివ, చేపూరి మర్యాదాసు, మాజీ ఎంఇఓ ప్రభాకర్, బొల్లెదు రాజేందర్, 3వ వార్డు కౌన్సిలర్ బెజ్జం రాజు, చావల నాగభూషణం, బట్టు మరియన్న, భరత్, జీవన్, రామాల జయరాజు, వేల్పుల బన్ని, మేడిపల్లి కిషోర్, కొంగల ప్రసాద్, బొబ్బిళ్లపాటి బాబురావు, రామాల ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రాన్ని ప్రారంభించిన మేయర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని 55వ డివిజన్ ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మేయర్ పునుకొల్లు నీరజ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు చల్లని తాగునీటిని అందించేందుకు కార్పోరేషన్, హార్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రయాణికులకు, పాదాచారులకు, ప్రజలకు ఉచితంగా శుద్ధిచేసిన చల్లని తాగునీటిని అందించడం జరుగుతుందని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మోతారపు శ్రావణి సుధాకర్, అన్నం ఫౌండేషన్ నిర్వహకులు అన్నం శ్రీనివాస్, హార్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ చీరలు పంపిణీ :**

ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని 32వ డివిజన్‌లో ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. సోమవారం జమలాపురం కేశవరావు పార్కులో జరిగిన కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొని మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మహిళల సంక్షేమానికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ డోన్‌వాన్ సరస్వతి రవి, రమేష్ గౌడ్, దివ్య, శంకర్ నాయక్, రమాదేవి, కుటుంబరావు, రాకేష్, ఉమేష్, జగదీష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధత కలిగిన నాయకుడు శ్రీకాంత్

**-ఆశయ సాధనకు పునరంకితమవుదాం : తమ్మినేని**





**ప్రజాపక్షం/ ఖమ్మం :** సిపిఎంలో సుదీర్ఘకాలం పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన యర్రా శ్రీకాంత్ నిబద్ధత కలిగిన నాయకుడని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం తెలిపారు. పార్టీ అప్పగించిన పనిని ఎన్ని ఆటుపోట్లు వచ్చిన పూర్తి చేసేంత వరకు విశ్రమించని యర్రా శ్రీకాంత్ మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటన్నారు. యర్రా శ్రీకాంత్ ప్రథమ వర్ధంతి సభ సోమవారం స్థానిక త్రీటౌన్‌లోని బోస్‌బొమ్మ సెంటర్‌లో జరిగింది. డివిజన్ కార్యదర్శి వై. విక్రం అధ్యక్షతన జరిగిన సభలో తమ్మినేని మాట్లాడుతూ త్రీటౌన్ ప్రాంతంలో మార్కెట్ కొనసాగేలా చేయడంలో శ్రీకాంత్ పోరాడి విజయం సాధించారన్నారు. తాను జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్న సమయంలో ఇండ్ల స్థలాల పోరాటంలోనూ ముందు వరుసలో నిలిచారని ఖమ్మం నగరంలో కార్మిక వర్గం సమస్యల పరిష్కారం కోసం కృషి చేసి బలమైన కార్మిక సంఘ నిర్మాణానికి దోహదపడ్డారన్నారు. మారుతున్న పరిణామాల్లో సిపిఎం ఒక స్పష్టమైన వైఖరితో పని చేస్తుందని ఆయన తెలిపారు. ఒక పక్క ఇరాన్, అమెరికా యుద్ధం, మరో పక్క మోడీ వ్యవహారశైలి భారత ప్రజలపై భారాన్ని మోపుతుందన్నారు. ధరల పెరుగుదలను నియంత్రించడంలోనూ, యుద్ధ ప్రారంభ దశలో నివారణ చర్యలు చేపట్టడంలోనూ మోడీ ప్రభుత్వం విఫలమైందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఊసరవెల్లిగా మారి ప్రాంతానికి ఒక తీరుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సభకు ముందు శ్రీకాంత్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సభలో సిఐటియు నాయకులు మందడపు సాయిబాబా, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు బండి రమేష్, బుగ్గవీటి సరళ, పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీనివాసరావు, బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు ర్యాలీ నిర్వహించారు.

# ముత్తగూడెంలో నీటి కష్టాలు..!

**- సైకిళ్లపై బకెట్లతో నీళ్లు తెచ్చుకుంటున్న ప్రజలు**





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీ ముత్తగూడెంలోని 21వార్డులో ప్రజల నీటి కష్టాలు వర్ణనతీతంగా ఉన్నాయి. గత నాలుగురోజుల క్రితం వాటర్‌పైప్‌లైన్ పగిలిపోయినప్పటికీ అధికారులు ఇప్పటికీ మరమ్మత్తులు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇండ్లలో నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు తాగునీటి కోసం అలమటిస్తున్నారు. నీటి కోసం పక్కబజారులోని పంపులు, బావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. అలాగే పెద్ద వయస్సు కలిగిన వారు సైకిల్‌పై నీళ్లు తెచ్చుకుంటుండం పరిస్థితికి అద్దం పడుతోంది.వేసవి కాలంలో ఏర్పడిన నీటి సమస్య తీవ్రంగా వేధిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సమస్యను త్వరగా పరిష్కారించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు. దీనిపై ఏఈ బాబును వివరణ కోరగా..రోడ్డుపక్కనే ఉండటంతో వాహనాలు తొక్కి పగిలిపోతుంది. ఇలా ఇప్పటికీ రెండు సార్లు మరమ్మత్తులు చేపించాము. పైప్‌లైన్‌ను తక్షణమే ఏర్పాటు చేపిస్తున్నట్లు తెలిపారు.

# విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

**- ప్రతి విద్యార్థికి హెల్త్‌కార్డు రూపొందించాలి**
**- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరిక**
**- కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్**





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** విద్యాసంస్థల్లో చదివే ప్రతి విద్యార్థి ఆరోగ్య వివరాలతో హెల్త్ ప్రొఫైల్ రూపొందించి, హెల్త్‌కార్డులు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి సూచించారు. సోమవారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని కస్తూరిబా గాంధీబాలికల విద్యాలయం(కేజీబీవీని) కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, వంటగది, స్టోర్‌రూమ్‌లను పరిశీలించి ఆహార నాణ్యత, నిల్వ విధానాలు, రికార్డులను తనిఖీ చేశారు. కామన్ మెనూ ప్రకారం విద్యార్థులకు సిద్ధం చేస్తున్న భోజనాన్ని కూడా పరిశీలించారు. పరిశరాల్లో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రహరీ గోడ, డైనింగ్‌హాల్ మరమ్మత్తులకు ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. అలాగే మంజూరైన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రతి వారం ప్రత్యేక అధికారులు తమ పరిధిలోని కేజీబీవీ,గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేసి వసతులు, భోజన నాణ్యతను పర్యవేక్షించాలని తెలిపారు. ఆర్‌బీఎస్‌కే ద్వారా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ప్రతి విద్యార్థికి డిజిటల్ హెల్త్ కార్డులు అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించడంతో పాటు పదవతరగతి పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. గురుకుల విద్యార్థుల సంక్షేమంలో నిర్లక్ష్యం సహించబోదని, అసవరమైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జెండర్ ఈక్విట్ కోఆర్డినేటర్‌రూబీ, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఆసియాబేగం, విద్యాశాఖ అధిఖారులు పాల్గోన్నారు.

# జనగణనకు క్షేత్రస్థాయిలో బ్లాక్‌లు ఏర్పాటు చేయండి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మే 11 నుంచి జూన్ 9 వరకు జరిగే జనగణన కు సంబంధించిన బ్లాక్ ను వెంటనే ఏర్పాటు చేయాలని నేలకొండపల్లి తహాశీల్దార్ రాంప్రసాద్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయం లో పంచాయతీ కార్యదర్శులు, జీపీవో లతో సోమవారం ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న జనగనణ ను విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతీ పంచాయతీలో 200 ఇళ్లకు ఒక బ్లాక్ గా ఏర్పాటు చేయాలని వాటికి తోడుగా మ్యాఫ్ ను తయారు చేయాలని సూచించారు. ఈ నెల 10 లోపు ఈ ప్రక్రియ ను పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి సి.హెచ్.శివ, మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు, మండల రెవిన్యూ ఇన్సెపెక్టర్ ఆలస్యం మధుసూధనరావు, అల్లం రవికుమార్, ఏఎస్ వో స్పందన, పంచాయతీ కార్యదర్శులు జీపీవో పాల్గొన్నారు.

# కరకగూడెం తహాశీల్దార్‌గా సూర్యప్రకాష్



**ప్రజాపక్షం/కరగూడెం:** కరకగూడెం మండల తహాశీల్దార్‌గా సూర్య ప్రకాష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించడమే తన ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# ఏజెన్సీ ప్రజల అభివృద్ధి లక్ష్యం

**- ఏఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్**



**ప్రజాపక్షం/చర్ల :** జిల్లాలోని ఏజెన్సీ ప్రాంత ప్రజల అభివృద్ధే పోలీసుల లక్ష్యమని భద్రాచలం ఏఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్ అన్నారు. సోమవారం చర్ల, దుమ్ముగూడెం మండలాల్లోని పలు ఆదివాసీ గ్రామాల్లో ఆయన కమ్యూనిటీ హాళ్లను ప్రారంభించారు. చర్ల మండలంలోని కుర్నపల్లి, బత్తినపల్లి, చెన్నాపురం, దుమ్ముగూడెం మండలంలోని చింతగుప్ప, ముల్కనపల్లి గ్రామాల ఆదివాసీ ప్రజలకు పలు కార్యక్రమాలకు ఉపయోగపడేలా నిర్మించినకమ్యూనిటీ హాళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా చర్ల మండలంలోని బట్టిగూడెంలో జరిగిన గ్రామోత్సవ సభలో కూడా పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ మారుమూల చర్ల, దుమ్ముగూడెంలోని ఏజెన్సీ గ్రామాలకు విద్య,వైద్యం రవాణా సదుపాయాలు అందించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ఇందులో భాగంగానే కమ్యూనిటీ హాళ్లను ఏర్పాటు చేశామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా పోలీసులకు తెలిపి పరిష్కార మార్గాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చర్ల సిఐ రాజువర్మ, దుమ్ముగూడెం సిఐ వెంకటప్పయ్య, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ, సిఆర్‌పిఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటింటికి సిపిఐని విజయవంతం చేయాలి




**ప్రజాపక్షం/పాల్వంచ :** సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఈనెల 1 నుండి 15వ, తేదీ వరకు జరిగే ఇంటింటింకి సిపిఐని విజయవంతంగా పూర్తి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయం చంద్రా రాజేశ్వరరావు భవన్‌లో సోమవారం పట్టణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ముత్యాల విశ్వనాథం మాట్లాడుతూ ప్రతీ నాయకుడు, కార్యకర్తల నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ సమస్యల పరిష్కారానికి పాటు పడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఇంటింటికి సిపిఐ, నిధుల సేకరణ, పార్టీ పత్రిక ప్రజాపక్షం పేపర్ చందాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. సభ్యత్వాలను చేర్పించడంలో అనుకున్న లక్ష్యాలను పూర్తి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ( కార్పోరేటర్ ) అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, కార్పోరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వర్‌రావు, గుర్రం వెంకటేశ్వర్లు, ఏఐటియుసి నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు, బర్ల వెంకటరత్నం, వాడె లక్ష్మి, అల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమం కోసం గత ప్రభుత్వం ఏనాడు ఆలోచన చేయలేదు

**- రైతులను దృష్టిలో ఉంచుకుని మొక్కజొన్న కేంద్రాల ఏర్పాటు**
**- తుంబూరు దయాకర్ రెడ్డి**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** రైతుల సంక్షేమం కోసం గత ప్రభుత్వం ఏనాడు ఆలోచన చేయలేదని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. మండలం లోని మోటాపురం లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత పాలకులు వ్యవసాయం ను పట్టించుకోకుండా వదిలేశారని అన్నారు. వరి వేస్తే ఉరే అన్న సందర్భం నుంచి నేటి ప్రజా ప్రభుత్వం గిట్టు బాటుధరలతో పాటు, బోనస్ ను అందించి వ్యవసాయం ను ప్రోత్సాహిస్తున్నట్లు తెలిపారు. రైతు భరోసా, వ్యవసాయం యాంత్రీకరణ పనిముట్లు సబ్సీడీ పై అందిస్తున్నట్లు తెలిపారు. రైతుల ను దృష్టిలో ఉంచుకుని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలలో విక్రయించుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని నిర్వహాకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సోసైటీ మాజీచైర్మన్ బాగం హేమంతరావు, మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నుపుసల సీతారాములు, కాంగ్రెస్ నాయకులు కొడాలి గోవిందరావు, బచ్చలకూరి నాగరాజు, తన్నీరు కృష్ణమూర్తి, భద్రయ్య, నంబూరి రామారావు, గుడిమళ్ల మధు, వెంకటేశ్వర్లు, మంకెన వెంకటేశ్వరరావు, కడియాల నరేష్, చిట్యాల రమేష్, పగిళ్ల పృధ్వీ, యర్రబోయిన నర్సయ్య, ధీరావత్ రాధాకృష్ణమూర్తి, వివిధ పంచాయతీ సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

# విపత్తులపై అవగాహన అవసరం : కలెక్టర్

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** విపత్తులపై అవగాహన ముందస్తు సన్నద్ధం ఉంటేనే ప్రాణ, ఆస్తినష్టం గణనీయంగా తగ్గించవచ్చని కలెక్టర్ అంకిత్ అన్నారు. సామాజిక చైతన్యమే లక్ష్యంగా జాతీయ విపత్తు స్పందన దళం ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న ఫెమిలియరైజేషన్ ఎక్సర్‌సైజ్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ప్రజల్లో విపత్తులపై అవగాహన కల్పించండం ఎంతో అవసరమని, నేటి నుండి పదిహేను రోజుల పాటు గోదావరి పరివాహక ప్రాంతాల్లో అవగాహనకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

# చిరస్మరణీయుడు తుళ్లూరు చిన్న సత్యం



**సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** తుళ్లూరు చిన్న సత్యం తనికెళ్ల గ్రామ ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేసుకొని చిరస్మరణీయుడుగా నిలిచాడని, కమ్యూనిస్టుపార్టీలో నిజాయితీ, నిబద్ధత కలిగిన నాయకుడు తుళ్లూరు చిన్నసత్యం అని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. మండల పరిదిలోని తనికెళ్లలో చిన్న సత్యం 19వ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహిచారు. సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో పల్గొన్న దండి సురేష్ మాట్లాడుతూ.. పార్టీలో క్రమశిక్షణగా ఎలా ఉండాలో చిన్నసత్యాన్ని చూసి నేర్చుకోవాలని తెలిపారు. మండల కార్యదర్శిగా పనిచేసినప్పుడు ప్రణాళికా బద్దంగా శాఖలు, మినిట్స్ నిర్వహణ చాలా బాగా నిర్వహించేవారని ప్రతి గ్రామాన్ని సందర్శించి పార్టీని నిర్మాణాత్మక పద్ధతుల్లో నడపాలని తెలిపేవారని అన్నారు. ప్రజాసంఘాల నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఎన్ని పనులున్నా పార్టీ సమావేశాలకు తప్పకుండా హాజరయ్యేవాడని తెలిపారు. ఆయన ఆశయాలు సాధించేందుకు ప్రతిఒక్కరు కృషిచేయాలని పిలుపునిచ్చారు. తనికెళ్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో తాగునీటి సమస్య ఉన్నదని తాగునీటి సమస్యతోపాటు పాఠశాల అభివృద్ధి కోసం చిన్నసత్యం కుమారుడు తుళ్లూరు రమేష్ లక్ష రూపాయల చెక్కును పాఠశాల హెచ్ఎం అబ్రహాంకు అందజేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, తనికెళ్ల సర్పంచ్ గడల కళావతి, మాజీ సర్పంచ్ గడల సీతారామయ్య, సిపిఐ జిల్లా నాయకులు పివిరావు, సీనియర్ నాయకులు బోడపోతుల లక్ష్మయ్య, కట్ల సత్యం, మహిళా సంఘం నాయకురాళ్లు పోటు కళావతి, ఏపూరి లతాదేవి, సిపిఐ కొణిజర్ల మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు, బాసా వెంకటేశ్వర్లు, ఎస్టీయు నాయకులు లేడిబోయిన గోపాల్‌రావు, అనంతోజు పుల్లయ్యాచారి, గడల జగపతి, విశ్రాంత ఉపాధ్యాయుడు కొణపర్తి విష్ణుమూర్తి, టిఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ రంజాన్, తుళ్లూరు ప్రసాద్, తుళ్లూరు మురళీ, తుళ్లూరు చిన్న సత్యం కుమారుడు తుళ్లూరు రమేష్, చిన్నసత్యం కుటుంబసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలను పరిష్కరించేందుకే ప్రజావాణి

**-మేయర్ పునుకొల్లు నీరజ**





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. సోమవారం ఖమ్మం కార్పోరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలకు సంబంధించి అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ఫుట్‌పాత్ నిర్మాణ పనులు పరిశీలన...**

ఖమ్మం నగరంలోని రెండవ డివిజన్ బల్లేపల్లి ప్రాంతంలో చేపట్టిన ఫుట్‌పాత్ నిర్మాణ పనులను మేయర్ పునుకొల్లు నీరజ సోమవారం పరిశీలించారు. పనులు నాణ్యతతో పాటు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు సౌకర్యవంతంగా నడిచే మార్గాలు ఉండేందుకు ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. రెండు కోట్లతో ఫుట్ పాత్‌ల నిర్మాణం చేపడుతున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈ ధరణికుమార్, ఏఈ యాకూబ్ వలీ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళా కౌన్సిలర్‌పై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

**మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ 13వ వార్డు కౌన్సిలర్ ముళ్లపాటి విజయపై దాడి చేసిన అన్వర్‌ను కఠినంగా శిక్షించి మరోసారి మహిళల వైపు కన్నెత్తి చూడకుండా అసభ్య ప్రవర్తన ప్రవర్తించకుండా చర్యలు తీసుకోవాలని వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ అన్నారు. సోమవారం కౌన్సిలర్ ముళ్లపాటి విజయను డాక్టర్ కాపా చంద్రకళ మహిళా కౌన్సిలర్లు వేముల శ్రావణి, చింతనిప్పు సులోచన, పుంద్ర వరలక్ష్మి తో కలిసి మాట్లాడుతూ వార్డులో అమృత్ పథకం క్రింద త్రాగునీటి సరఫరా కోసం అభివృద్ధి పనిలో భాగంగా పైపులైన్ నిర్మాణం జరుగుతుంటే నిర్మాణ పనుల వద్దకు పర్యవేక్షణకు వెళ్లిన కౌన్సిలర్ విజయపై అసభ్యంగా ప్రవర్తించిన అన్వర్ ఒక మహిళ అని చూడకుండా అసభ్యంగా సమాజం తలదించుకునేలా ప్రవర్తించిన తీరు అక్కడున్న ప్రజలు ప్రతిఒక్కరూ తీవ్రంగా ఖండించారు. అభివృద్ధి పనులను అడ్డుకోవడమే కాకుండా మహిళలపై దాడి చేసి కాలు ప్యాక్చర్‌కి కారణమైన వ్యక్తిపై జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులకు, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు పెద్ద పీఠ చేస్తుంటే అలాంటి మహిళలను గౌరవించాల్సింది పోయి మహిళలపై దాడులకు పాల్పడుతూ అసభ్య ప్రవర్తన చేయడం సిగ్గుచేటని అన్నారు. అతనితో పాటు దాడికి పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం పరిధిలోని జాతీయ రహదారిపై రామకృష్ణాపురం వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగరాజు (32) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా శ్రీరామ్ అనే వ్యక్తి కి తీవ్రగాయాలు కావడంతో అతనిని మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. నాగరాజు ది కల్లూరు మండలం లక్ష్మీ పురం గ్రామం కాగా, అతనికి భార్య కవిత ఇద్దరు పాపలు ఉన్నారు. భార్య పేరు మేరకు కేసు నమోదు చేసినట్లు కల్లూరు పోలీసులు తెలిపారు. అదేవిధంగా శ్రీరామ్ అనే వ్యక్తి జంగారెడ్డిగూడెం కు చెందిన వ్యక్తి అతను ఖమ్మం వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయమై కల్లూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

## రూ. 60 లక్షలతో నియంత్రికలు ఏర్పాటు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని కల్లూరు మరియు పెద్ద కోరుకొండి విద్యుత్ ఉపకేంద్రముల పరిధిలోని అధిక లోడింగ్ తట్టుకునేందుకు వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరాను అందించేందుకు 60 లక్షలు విలువచేసే నియంత్రికలు లను ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ అధికారులు మహేంద్ర కుమార్, అబ్దుల్ ఆసిఫ్ లు తెలిపారు. పెద్ద కోరుకొండి, పరిధిలో చెన్నూరు ,చిన్న కోరుకొండి ,ఎర్రబోయినపల్లి గ్రామాలతో పాటు కల్లూరు ఉపకేంద్రం పరిధిలో పేరువంచ నారాయణపురం గోకవరం తదితర గ్రామాలలో మొత్తం 50 నియంత్రికలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు సరఫరా లో ఎలాంటి అంతరాయం లేకుండా వినియోగదారులు ఇబ్బందులు పడకుండా విద్యుత్ శాఖ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవి ప్రణాళికలో భాగంగా నిర్మాణాలు చేపట్టడం జరిగిందని వివరించారు.

# నేడు ఖమ్మంలో మంత్రి తుమ్మల పర్యటన

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మంలో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. ఈనెల ఏడు మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని 56వ డివిజన్ విజయ్ నగర్ కాలనీలో సిసి రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 6.30కు 20వ డివిజన్ రామచంద్రయ్య నగర్‌లో 33/11కెవి విద్యుత్ సబ్ స్టేషన్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారు. ఈనెల ఎనిమిదిన బుధవారం ఉదయం 9 గంటలకు ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని 41వ డివిజన్ నిజాంపేటలో పాఠశాల(దృష్టిలోపం ఉన్న వారి పాఠశాల)ను ప్రారంభిస్తారు. ఉదయం 9.30కు 34వ డివిజన్ పిసికె తోటలో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. ఉదయం 10.45 గంటలకు ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొంటారు.

# చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు శిక్ష, రూ.10వేల పరిహారం చెల్లించాలని తీర్పునిస్తూ ఖమ్మం మొదటి అదనపు ప్రథమశ్రేణి న్యాయస్థానం న్యాయాధికారి బెక్కం రజని సోమవారం తీర్పునిచ్చారు. ఖమ్మం పట్టణానికి చెందిన తలారి రాధాకృష్ణ వద్ద 2020 ఫిబ్రవరి 16న నిందితుడు షేక్ మిరాజుద్దీన్ రూ.10లక్షలు అప్పుగా తీసుకుని ప్రాంసరీ నోటు రాసిచ్చాడు. రుణం తిరిగి చెల్లించాలని కోరడంతో 20మే 2022న రూ. 10 లక్షలకు చెక్కు జారీ చేశాడు. ఖాతాలో నగదు లేకపోవడంతో చెక్కు తిరస్కరణకు గురైంది. దీనితో ఫిర్యాదుదారుడు న్యాయవాది చార్లెస్ వినయ్ ద్వారా న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. విచారణ జరిపిన న్యాయస్థానం నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పునిచ్చారు.

# తోట రామారావు జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** బిఆర్ఎస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ తోట రామారావు జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరైన ఆయన అభిమానులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. వార్డుల్లో సమస్యలను గుర్తించడంతో పాటు వాటి పరిష్కారానికి కృషి చేసే రామారావు త్రీటౌన్ ప్రాంతంలో మంచి పేరు సంపాదించారు. జన్మదిన వేడుకల్లో 46, 47, 48 డివిజన్ల ప్రజలతో పాటు పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

**-క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ -ఇద్దరికి తీవ్ర గాయాలు**



**ప్రజాపక్షం/వైరా:** గ్రీన్‌ఫీల్డ్ హైవే వద్ద ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొనడంతో ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తుని నుండి ఖమ్మం వెళుతున్న కొబ్బరికాయల లోడు లారీ గ్రీన్‌ఫీల్డ్ హైవే దిగి ప్రక్కన నిలిపి ఉంచడంతో మధిర నుండి వైరా వస్తున్న లారీ వేగంగా వెనుక నుండి ఢీకొట్టడంతో ముందున్న చెట్టును లారీ ఢీకొంది. అందులో ఉన్న డ్రైవర్లు మామి గోవిందు, బాకారపు సతీష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్యాబినెట్‌లో ఇరుక్కున్న ఇద్దరు డ్రైవర్లను పోలీసులు జేసిబిల సహాయంతో బయటకు తీశారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కౌన్సిలర్‌పై దాడి కేసులో ఆరుగురిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు కౌన్సిలర్ ముళ్లపాటి విజయలక్ష్మి పై దాడి చేసిన సంఘటనలో వైరా ఎస్సై రామారావు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. 13వ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకుడు సయ్యద్ అన్వర్‌తో పాటుగా అహ్మద్, అక్రమ్, ఆసిఫ్, హలీం, ఆరిఫ్ అనే వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా 13వ వార్డులో జరిగిన ఘర్షణలో అన్వర్ ఫిర్యాదు మేరకు వైరా పోలీసులు విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, సీతారాములు, రంగ, పద్మ, అనిత తదితరులపై కేసు నమోదు చేశారు.

# త్వరలోనే స్మార్ట్ కార్డులు పంపిణీ





**ప్రజాపక్షం/వైరా:** వైరా ఆర్‌టిసి బస్టాండ్‌ను సోమ వారం తెలంగాణ ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డి పరిశీలిం చారు. ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా వైరా, మధి ర, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ బస్‌స్టేషన్‌లను పరిశీలించడానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. వైరా బస్టాండ్ ఆవరణను పరిశీలించిన అనంతరం ఆర్‌టిసి యండి.నాగిరెడ్డి మాట్లాడుతూ వైరా బస్టాండ్ నిత్యం ప్రయాణీకులతో రద్దీగా ఉంటుంది. బస్టాండ్‌లో ప్రతిరోజు సుమారు 40వేల మంది ప్రయాణీకులు ఈ బస్టాండ్ మీద ప్రయాణిస్తూ ఉన్నారని అన్నారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి స్మార్ట్‌కార్డులు ప్రభుత్వం అందించడం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి ఆర్ఎం.సాయిరామ్, డిఎం డి.రామయ్య, వైరా సిఐ వెంకటప్రసాద్, ఎస్సైలు పుప్పాల రామారావు, పవన్, ఆర్‌టిసి అధికారులు కెవి.రెడ్డి, పాలబోయిన వెంకటేశ్వరరావు, పలువురు ఆర్‌టిసి సిబ్బంది పాల్గొన్నారు.